సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



గండికోటలో టెంట్లు..
పర్యాటక కేంద్రం గండికోటలో జనవరి వేడుకలను నిర్వహించుకునేందుకు భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. దీంతో టెంట్లకు డిమాండ్ పెరిగిపోయింది. -8లో



పకడ్బందీగా పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియ
జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో సోమవారం కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
30.7/19.9

వాతావరణం
జిల్లాలో సోమవారం 19.9 - 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు మంత్రి రాక
కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం కడపకు రానున్నారని కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించనున్నారు. అనంతరం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పరామర్శించనున్నారు.

1న కేంద్ర మంత్రి జిల్లాకు రాక
కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ జనవరి 1వ తేది రాత్రి జిల్లాకు రానున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. మంత్రి రెండు రోజులపాటు జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఈవీఎం గోడౌన్ల పరిశీలన
కడప సెవెన్‌రోడ్స్: కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్లను సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర ప్రసాద్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్ రావు, సుధాకర్, శ్రీనివాసులు, మనోహర్ పాల్గొన్నారు.

జనవరి 3 నుంచి డీఫార్మసీ కౌన్సెలింగ్
కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ పాసై రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 2025 జనవరి 3,4 తేదీలలో కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువప్రతాల (కౌన్సెలింగ్) పరిశీలన జరుగుతుందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. డీఫార్మసీ కోసం 2,3 తేదీల్లో ఆన్‌లైన్ ప్రాసెసింగ్ రుసుం చెల్లించాలని తెలిపారు. ఇందులో ఓసీ, బీసీలు రూ.1200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 600 చెల్లించాలని తెలిపారు. 4,5 తేదీల్లో ఆప్షన్ ప్రక్రియ పెట్టుకోవచ్చని చెప్పారు. 7వ తేదీ సీట్ అలాట్‌మెంట్ జరుగుతుందని వివరించారు.

1న హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సులు
బి.కొత్తకోట: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం జనవరి ఒకటిన మదనపల్లె-1 ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో చీఫ్ ఇన్స్‌పెక్టర్ రేవతి సోమవారం తెలిపారు. బుధవారం మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్, బి.కొత్తకోట మండలంలోని కాండ్లమడుగు క్రాస్, బి.కొత్తకోట నుంచి వీటిని నడుపుతున్నట్టు తెలిపారు.మదనపల్లె-హార్సిలీహిల్స్ మధ్య 11 బస్సులు తిరుగుతాయన్నారు. కడప, రాయచోటి, సత్యసాయి, అనంతపురం ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం హార్సిలీహిల్స్ దిగువ కాండ్లమడుగు వద్ద నుంచి కొండపైకి 10 బస్సులు, బి.కొత్తకోట నుంచి హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు నడుస్తాయని చెప్పారు.

టెండర్‌కు చెక్!

మత్స్య సంపద పెంపొందించేందుకు చేపట్టిన టెండర్లు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. ఏకపక్షంగా టెండర్లు దక్కించుకోవాలనుకున్న తెలుగుతమ్ముళ్ల ఎత్తుగడలు బెడిసికొట్టాయి. 'తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నే వాడు ఇంకొకడుంటాడన్న'నానుడి అక్షరాల నిజమైంది. టెండర్లలో పాల్గొనకుండా జిల్లా నేతలు వ్యూహాత్మకంగా అడ్డుకుంటే ఏకంగా టెండర్లు వాయిదా వేయించి ఘనత సోమవారం తెరపైకి వచ్చింది.



- మత్స్యశాఖ టెండర్లు వాయిదా!
- స్థానిక టీడీపీ నేతల వ్యూహం బెడిసికొట్టిన వైనం
- కాంట్రాక్టర్లు కిడ్నాప్... గడువు ముగిశాక విడుదల
- అనివార్యకారణాల వల్ల టెండరు వాయిదా వేశామని డీడీ వెల్లడి

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా మత్స్యశాఖ పరిధిలోగల చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లల పెంపకానికి అధికారులు టెండర్లు పిలిచారు. సోమశిల, గండికోట, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్లులో 40లక్షల చేప పిల్లలు విడిచేందుకు టెండర్లను ఆహ్వానించారు. తక్కువ రేటు కోట్ చేసిన వారికి టెండర్లు ఖరారు చేయనున్నారు. కాగా రాయలసీమ ప్రాంతంలో టెండరు లైసెన్సుదారులు చాలా అరుదుగా ఉన్నారు. రాష్ట్రంలోని కైకలూరు, భీమవరం ప్రాంతాల నుంచి టెండరుదారులు టెండరు వేసేందుకు కడపలోని కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఓ టీడీపీ నాయకుడి నేతృత్వంలో ఆయా ప్రాంతాలకు చెందిన వారిని టెండర్లో పాల్గొనకుండా వ్యూహాత్మకంగా అడ్డుకున్నారు. జిల్లా టీడీపీ ముఖ్య నేతల పేర్లు చెబుతూ బెదిరింపులకు దిగారు. ఏకంగా రహస్య ప్రాంతానికి తరలించి టెండర్ గడువు ముగిసేంత వరకూ అదుపులో పెట్టుకున్నట్లు సమాచారం. ఆపై టీడీపీకి అనువైన రెండు టెండర్లు చివరి నిమిషంలో దాఖలు చేశారు. సింగిల్ టెండర్ కాకుండా జాగ్రత్త పడ్డారు. టెండర్ గడువు ముగిసిన తర్వాత భీమవరం, కైకలూరు ప్రాంతాలకు చెందిన వారిని వదిలిపెట్టారు. వారు కార్యాలయానికి చేరుకొని టెండర్ దాఖలు చేసేందుకు ఇన్‌ఛార్జీ డీడీ నాగరాజును కోరగా అప్పటికే టెండర్ గడువు ముగిసిందని జవాబు వచ్చింది.



▶▶ హైలెవెల్ సిఫార్సులు రావడంతో....

కడపలో చేపట్టిన టెండర్లు ఏకపక్షంగా చేపట్టారని అసలు టెండర్లల్లో పాల్గొనే అవకాశమే లేకుండా చేశారని, డీడీని కలిస్తే గడువు ముగిసిందని చెబుతున్నారంటూ ఆయా కాంట్రాక్టర్లు భీమవరంలోని అధికార పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆ ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖనాయకుడు కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో ఫోన్‌లో వాకబు చేసినట్లు సమాచారం. టెండరు దాఖలు చేయడానికి వచ్చిన వారు డీడీ కార్యాలయంలోనే ఉన్నారని తెలియజేసినట్లు సమాచారం. ఏకపక్షంగా టెండర్లు ఎలా నిర్వహిస్తారంటూ నిలదీసినట్లు తెలుస్తోంది. వెంటనే స్పందించిన కలెక్టర్ మత్స్యశాఖ డీడీ నాగరాజును ఆరా తీశారు. ఆపై అసలు విషయం వెలుగుచూసినట్లు తెలుస్తోంది. వెంటనే టెండర్లు వాయిదా వేయాలంటూ కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సమాచారం. కాగా, ఈవిషయమై ఇన్‌చార్జీ డీడీ నాగరాజు వివరణ కోరగా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అందుబాటులో లేకపోవడంతోపాటు కొన్ని అనివార్య కారణాల వల్ల టెండర్లను వాయిదా వేశామని తెలియజేశారు. టెండర్లలో పాల్గొనేందుకు వచ్చిన వారు ఇబ్బందులు పడినట్లు.. కిడ్నాప్‌కు గురైనట్లు అధికారికంగా తన దృష్టికి రాలేదని తెలిపారు.

పండక్కు బస్సు సిద్ధం

- సంక్రాంతి పండుగకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సర్వీసులు
- జిల్లాలోని ఆరు డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు 294 బస్సులు
- అత్యధికంగా హైదరాబాదుకు 111, బెంగుళూరుకు 81 ప్రత్యేక సర్వీసులు
- రాను, పోను టిక్కెట్ బుక్ చేసుకునే వారికి 10 శాతం ప్రత్యేక రాయితీ
- ఇప్పటికే ప్రారంభమైన ఆన్‌లైన్ రిజర్వేషన్



కడప కోటిరెడ్డిసర్కిల్: తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతికి ప్రజలతో పాటు ఆర్టీసీ సంస్థ సిద్ధమవుతోంది. పట్టణాలు.. నగరాల్లో ఉండే వారిని పల్లె చెంతకు చేర్చేందుకు సమాయత్తమవుతోంది. సంక్రాంతికి పల్లె పండుగ అని పేరు. జిల్లాకు చెందిన చాలామంది హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలోనూ, వ్యాపారాల్లో స్థిరపడి ఉన్నారు. వీరంతా సంక్రాంతికి వస్తారు. వీరి ప్రయాణాల కోసం ఆర్టీసీ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ప్రత్యేక సర్వీసులు
పండుగ నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి జిల్లావాసులను తీసుకు వచ్చేందుకు, తిరిగి వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు వైఎస్సార్ జిల్లా ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లాలోని కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి జనవరి 9 నుంచి ఈ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే తిరిగి 16వ తేదినుంచి ఆయా నగరాలు, పట్టణాలకు వెళ్లేందుకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ రిజర్వేషన్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచారు. కడప రీజియన్ పరిధిలో రెగ్యులర్ సర్వీసులతోపాటు హైదరాబాదుకు 111, బెంగుళూరుకు 81, చెన్నైకి 12, విజయవాడకు 30, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురానికి 60 బస్సులు చొప్పున మొత్తం 294 బస్సులు నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సాధారణ చార్జీలతోనే....
గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడపాలని ఆదేశించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమూ అదే విధానాన్ని అనుసరిస్తుండడం విశేషం. కాగా అంతకుముందు టీడీపీ హయాంలో స్పెషల్ సర్వీసులకు చార్జీలు పెంచి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేయడంతో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి



సంక్రాంతి పండుగకు జిల్లాకు వచ్చే ప్రయాణికులకు రానుపోను ఒకేసారి టిక్కెట్లు రిజర్వు చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నాం. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు వచ్చి పోయే ప్రయాణికులకు ఈ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాం. డిమాండును బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. – పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారాప్రజల నుంచి అందిన విజ్ఞప్తులలో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి.

- తన భర్తను ఈనెల 6వ తేది బంధువులు హత్య చేశారని, తనకు ఎలాంటి జీవనాధారం లేనందున అర్థిక సహాయంతో ఆదుకోవాలని చక్రాయపేట మండలం గండికొవ్వూరుకు చెందిన దళిత మహిళ దండు శివ లక్ష్మీదేవి కోరారు.
- అట్లూరు క్రాస్ రోడ్డులో దేవాలయ నిర్మాణానికి స్థలాన్ని ఇప్పించాలని అట్లూరు మండల కేంద్రానికి చెందిన ఎం.అబ్రహం విన్నవించారు.
- తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కడప ఇందిరా నగర్‌కు చెందిన కె.ఓబులేసు కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు, జడ్పి సీఈవో ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు, ఎస్డీసిలు వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల నిర్మాణ పనులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చేపట్టిన అన్ని రకాల నిర్మాణాలను నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఆకాంక్ష జిల్లాల అభివృద్ధిలో భాగంగా ఎంపికైన మండలాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సీపీవో హాజరతయ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఏపీఎంఐపి, ఏపీఎస్ఆర్ఐసి, ఆర్-బి, ఎస్ఎస్ఏ, హౌసింగ్, డబ్ల్యుఆర్డీ, ఇరిగేషన్ తదితర శాఖల ఎస్ఈలు, డీఈలు, ఈఈలు తదితర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు
- టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

కడప కల్చరల్: తిరుమలకు తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఆలయ నిర్వాహకులు, అధికారులకు సూచించారు. సోమవారం ఆయన బ్రహ్మోత్సవాల నిర్వహణ గురించి టీటీడీ అధికారులు, అర్చకులతో బ్రహ్మోత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

ఉత్సవాలు ఘనంగా...
అనంతరం ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఉత్సవాల నిర్వహణకుగల అనుకూలాలు, ప్రతికూలాలను గురించి అధికారులతో మాట్లాడారు. ఆలయంలో జనవరి 1న, వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని, ఆ తర్వాత రానున్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణ, క్యూలైన్లు, భక్తులకు తాగునీరు, ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రసాద వితరణ చేయాలని సూచించారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రతిరోజు భక్తులు దాతల సాయంతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్నదానం గురించి భక్తులకు తెలిసేలా ఆలయం వెలుపల పెద్దపెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రథోత్సవం రోజు ప్రత్యేకంగా భక్తులకు ఏమాత్రం కొరత లేని విధంగా మంచినీరు, ప్రసాదం అందుబాటులో ఉంచాలని సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, ఆలయ డీపీ డిప్యూటీవో నరేష్ బాబు ఇన్స్‌పెక్టర్ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

పోలీసుల పనితీరు భేష్!

- నేరాలు 31 శాతం తగ్గుదల
- సమిష్టి కృషితో క్రైమ్ రేట్ తగ్గింది
- ఎస్సీ,ఎస్టీ కేసులో గత ఏడాదితో పోల్చితే 32 శాతం తక్కువ
- మెరుగైన పెట్రోలింగ్, రోడ్డు ప్రమాదాల మరణాల్లో 15శాతం తగ్గుదల
- 2024 నేరాల సమీక్షపై మీడియా సమావేశంలో ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు



కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్ష- 2024పై మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్: జిల్లాలో పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేయడం వల్ల 2024లో నేరాలు తగ్గాయని, పోలీసుల సమిష్టి కృషి వల్లే సాధ్యమైందనీ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. పోలీసింగ్‌లో వినూత్నమైన మార్పులు తీసుకురావడంతోనే ఇది సాధ్యమైందని, మరింత ద్విగుణీకృత ఉత్సాహంతో 2025లో ప్రజలకు ఉత్తమమైన సేవలను అందిస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలను పక్కా ప్రణాళికతో ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని కొనియాడారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నేరాల సమీక్షపై ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మీడియాకు వివరించారు.

నేర గణాంకాల వివరాలిలా ఉన్నాయి...

- విజిబుల్ పోలీసింగ్, అసాంఘిక శక్తులపైనా నిఘా, అవగాహన కార్యక్రమాలను చేపట్టడం, పి.డియాక్ట్ ప్రయోగం, నాటుసారా, అక్రమమద్యంపై ఉక్కుపాదం మోపడం, కన్విక్షన్ బేస్ట్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించడం, గంజాయి పైన కట్టడి వల్ల నేరాలు 31 శాతం తగ్గుముఖం పట్టాయని ఎస్పీ వివరించారు.
- ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక చట్టం) కేసులు గత ఏడాదితో పోల్చితే 32 శాతం తగ్గాయన్నారు. 2023లో 115 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 78 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు.
- ఈ ఏడాది ఇతర రాష్ట్రాలకు చెందిన (ఎన్.డి.పి.ఎల్) మద్యం 7285 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 99 కేసుల్లో మొత్తం 130 కేసులుగా నమోదు చేశారన్నారు. అక్రమంగా విక్రయిస్తున్న డి.పి.ఎల్(డ్యూటీపెయిడ్ లిక్కర్)పై ముమ్మరంగా దాడులను నిర్వహించి 1609 కేసుల్లో 9535 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 1657 మందిని అరెస్ట్ చేశారన్నారు. నాటుసారాకు సంబంధించి 53 కేసుల్లో 974 లీటర్లను స్వాధీనం చేసుకుని మొత్తం 61 మందిని అరెస్ట్ చేశామని వివరించారు.

- రోడ్డు ప్రమాద మరణాల్లో 15 శాతం, తీవ్ర రోడ్డు ప్రమాదాల్లో 12 శాతం తగ్గుదల కనిపించిందని.. జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించడం వల్లే ఈ తగ్గుదల నమోదైందన్నారు. నూతన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం నిబంధనలను అమలుపరిచి కేసులను నమోదు చేస్తామన్నారు. రోడ్డు భద్రత, ప్రమాద నివారణలపై కోర్టు ఉత్తర్వులను అమలు పరుస్తున్నామన్నారు.

- జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపిందన్నారు. 8075 కేసులు నమోదయ్యాయన్నారు.
- 2024లో జిల్లాలో మొత్తం 381 దొంగతనాల కేసులు నమోదుకాగా, 188 కేసులు (49శాతం) ఛేదించి, రూ.6,95,73,004 మొత్తంలో రూ.2,67,76,193 (38శాతం) మొత్తాన్ని రికవరీ చేశామన్నారు. ఈ ఏడాదిలో డెకాయిట్‌గానీ, లాభంకోసం హత్యకానీ జరుగలేదన్నారు.
- క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, కోడిపందేలపై ముమ్మరంగా దాడులను నిర్వహించామన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి దాడులను నిర్వహించి 725 కేసులు నమోదు చేసి, 3429 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.1,25,22,015 స్వాధీనం చేసుకున్నామన్నారు.
- జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై అక్రమ రవాణా నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని.. 2024లో 4 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 5772 కిలోల బరువున్న 236 దుంగలను, 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.
- జిల్లాలో గంజాయి విక్రయాలపై ముమ్మరంగా దాడులను నిర్వహించి 47 కేసులు నమోదు చేసి 140 మందిని అరెస్ట్ చేశారన్నారు. 188 కిలోల గంజాయి, 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

- కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటుతో కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసుల విచారణ త్వరితగతిన జరిగి సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో నమోదైన తీవ్రమైన 8 కేసుల్లో 30 మంది నిందితులకు కోర్టులో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా పోలీస్ అధికారులు సమిష్టిగా కృషి చేశారన్నారు.

- సైబర్ నేరాలకు సంబంధించి ఈ ఏడాది 58 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న మొత్తం రూ.7.66.36.205 కాగా, రూ.4,86,897 మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేశామని వివరించారు. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లకు చెందిన మొత్తం 135 బ్యాంక్ అకౌంట్లను గుర్తించి అందులోని రూ.6,36,58,163లను స్తంభింపజేశామని(ఫ్రీజ్) పేర్కొన్నారు.

- కిడ్నాప్ కేసులు ఈ ఏడాది 15 నమోదయ్యాయి.
- మహిళలపై నేరాలకు సంబంధించి ఈ ఏడాది 557 కేసులు నమోదయ్యాయన్నారు.
- వరకట్న వేధింపుల మరణాలు ఈ ఏడాది 3 కేసులు నమోదయ్యాయన్నారు.
- జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న 1,84,50,000 విలువైన 1230 మొబైల్‌ఫోన్‌లను సైబర్‌క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో రికవరీ చేసి తిరిగి బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు.
- 2023లో 51 హత్య కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 53 హత్య కేసులు నమోదయ్యాయన్నారు.
- తీవ్రగాయం కలుగచేయడం కేసుల్లో 12 శాతం తగ్గదల నమోదయ్యాయన్నారు.
- అత్యాచార కేసులు 28 నమోదయ్యాన్నారు.
- చీటింగ్ కేసులు 2023లో 295 నమోదుకాగా, ఈ ఏడాది 218 నమోదయ్యాయన్నారు.
- ఈ ఏడాది 556 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కేసుల్లో 487 మంది ఆచూకీ కనుగొని కుటుంబసభ్యుల చెంతకు చేర్చారన్నారు.
- జాతీయ లోక్ అదాలత్, లోక్ అదాలత్‌ల ద్వారా జిల్లాలో 2024లో 11,484 కేసులను పరిష్కారం లభించిందని వెల్లడించారు
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తున్నామన్నారు. ఈ ఏడాది 7695 ఫిర్యాదులు రాగా 7374 ఫిర్యాదులను పరిష్కరించడమైందన్నారు. జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రకాష్‌బాబు, కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 30 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ సదస్సులు మంగళవారం జిల్లాలోని 30 గ్రామాలలో నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు కోరారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని కామకుంట, రేకులకుంట, కొంగలవీడు, కలసపాడు, వెంగళంపల్లి, సిద్ధకిచాయపల్లె , కొత్రపాటిపల్లి, పులివెందుల రెవిన్యూ డివిజన్‌లో నేర్సుపల్లి, అలిరెడ్డిపల్లి, హిరోజీపురం, తెలికి, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లో రాజుపాలెం పైడల, ఎర్రగుంటపల్లె, మాధవపురం, గరిసలూరు, బలపనగూడురు, చెన్నమనేనిపల్లె, లింగమనేనిపల్లె, కోడూరు, కన్నెలూరు, అరవేటిపల్లి, గొల్లపల్లె, చాపాడు, శెట్టివారిపల్లెలో సదస్సులు జరుగుతాయి. కడప రెవెన్యూ డివిజన్‌లోని పగడాలపల్లె, వల్లూరు మండలం వెంకటేశపురం, కడప మండలం చిన్నచౌకు, ఖాజీపేట మండలం సి.కొత్తపేట, చింతకొమ్మదిన్నె మండలం అప్పరాజుపల్లి, కమలాపురం మండలం పెద్ద చెప్పలి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని డీఆర్వో వివరించారు.

క్లుప్తంగా

దాడికి యత్నించిన మహిళ బైండోవర్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా కోర్టుకు వాయిదా కోసం వచ్చిన తన చెల్లెలి భర్తపై ఓ మహిళ దాడికి యత్నించింది. ఈ సంఘటనపై పోలీసులు విచారించి బైండోవర్ చేశారు.

ఎక్సైజ్ సీఐపై విచారణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న ఓ సీఐ తీసుకున్న అప్పు చెల్లించలేదని బాధితులు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2016 సంవత్సరంలో కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో క్లర్క్‌గా పని చేస్తూ ప్రమోషన్‌పై ప్రస్తుతం హెడ్‌క్వార్టర్స్‌లో సీఐగా పని చేస్తున్న అతను శ్రీనివాసులు రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ. 9 లక్షలు అప్పు తీసుకున్నాడు. తిరిగి ఆ మొత్తాన్ని చెల్లించకపోవడంతో బాధితుడు ఎక్సైజ్ శాఖ మంత్రికి, హోంమంత్రికి ఫిర్యాదు చేశాడు. వారు జిల్లా ఉన్నతాధికారులకు విచారణ నిమిత్తం బదలాయించారు. ఈ మేరకు సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

రైలు కింద పడి మహిళ మృతి



రైలు ఢీ కొని మృతి చెందిన స్వాతి

కమలాపురం : కమలాపురం రైల్వే గేటు సమీపంలో ఓ మహిళ ప్రమాద వశాత్తు రైలు కింద పడి మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోగటం గ్రామానికి చెందిన జరుగు స్వాతి (26) ఏఐఎల్ డిక్సన్ కంపెనీలో పని చేస్తోంది. రోజూ లాగే సోమవారం రాత్రి డ్యూటీ దిగి ఇంటికి వెళ్లే క్రమంలో రైల్వే గేటు దగ్గర బస్సు దిగింది. ఇంటికి వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా ఎక్సలేటర్ ఇంజన్ దగ్గరకు వచ్చేసింది. ఫోన్‌లో మాట్లాడుతూ ట్రాక్ దాటేందుకు ప్రయత్నం చేస్తున్న స్వాతి షాక్‌కు గురై నిలబడిపోయింది. దీంతో ఇంజన్ వచ్చి ఢీ కొట్టి శరీరాన్ని కొంత దూరం లాక్కెళ్లింది. ఈ ఘటనలో స్వాతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు గేట్‌మెన్ తెలిపారు. కాగా మృతురాలికి తల్లి, తండ్రి, సోదరుడు, వివాహిత సోదరి ఉన్నట్లు తెలిసింది.

అప్పుల బాధతో చేనేత కార్మికురాలి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న కుండా జయలక్ష్మి

మైలవరం : వేపరాల గ్రామానికి చెందిన కుండా జయలక్ష్మి అనే చేనేత కార్మికురాలు అప్పుల బాధతో సోమవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు.. కుండా జయలక్ష్మి భర్త వెంకటరమణ, కుమారుడు గోపాల్ వర్మ చేనేత కార్మికులు. గత సంవత్సరం భర్త వెంకట రమణకు బైపాస్ సర్జరీ, షుగర్ వ్యాధితో కాలికి సర్జరీ చేసి తొలగించారు. ఈ మధ్య కాలంలో కుమారుని వివాహం చేయడంతో అప్పులు అయ్యాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది.

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడి

సుండుపల్లె : చప్పిడివాండ్లపల్లె సమీపంలో స్పెషల్ పార్టీ పోలీసుల సాయంతో సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు కోడి పందెం స్థావరంపై దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకున్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో.. తస్మాత్ జాగ్రత్త.!



వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఈనెల 31వ తేదీ రాత్రి, నూతన సంవత్సరం వేడుకలకు సంబంధించి పోలీసు వారి సూచనలను ప్రజలు, వాహనదారులు తప్పక పాటించాలని ఉమ్మడి జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఈ రెండు జిల్లాల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 5 గంటల వరకు ప్రతి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు చేపడతారు.
- స్పెషల్ టీమ్స్, మొబైల్ టీమ్స్‌గా ఏర్పడి ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, స్పీడ్ లేజర్ గన్ ద్వారా వాహన తనిఖీలు చేస్తారు.
- కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ నుంచి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, గువ్వలచెరువు ఘాట్ రోడ్డు, రిమ్స్ రింగ్ రోడ్డు మిగతా బైపాస్ రోడ్లను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 3 గంటల వరకు మూసివేస్తారు.
- బైక్‌లను అకారణంగా రోడ్లపైకి అనుమతించరు. మైనర్లు వాహనాలను నడిపితే వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- ద్విచక్రవాహనాల సైలెన్సర్స్ తీసివేసిన వాహనాల యజమానులపై, నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- వేడుకల పేరుతో మహిళల పట్ల, ఇతర వాహనదారుల పట్ల అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తించరాదు.
- ఎవరైనా నూతన సంవత్సర ఈవెంట్స్ నిర్వహించాలనుకుంటే ముందుగా ఎస్‌డీపీఓ అనుమతి తీసుకోవాలి.
- రోడ్లపైన ట్రాఫిక్ జామ్ చేసి, కేకులు కట్ చేయరాదు. రోడ్లపైన ఉన్న బారికేడ్స్‌కు, డివైడర్స్‌కు, రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- రోడ్లపైనగానీ, జంక్షన్‌ల వద్ద ఎలాంటి టపాసులు పేల్చరాదు.
- నూతన సంవత్సరం సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఏం చేస్తున్నారు అనే విషయాలపై తప్పనిసరిగా నిఘా ఉంచాలి.

పకడ్బందీగా పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియ

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్‌నాయుడు



దేహదారుఢ్య పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్ : పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డి.టి.సి)లో దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను ప్రారంభించి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి రోజూ అభ్యర్థులకు తొలుత సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతీ తదితర కొలతలతో పాటు బయోమెట్రిక్ తీసుకుంటారన్నారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎక్కడా కూడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావులేకుండా ఆధునిక ఆర్.ఎఫ్.ఐ.డి కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం కచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తరువాత జారీ చేసిన కులధ్రువీకరణ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. వాటితో పాటు ఆధార్, స్టేజ్-2, స్టడీ, మార్కుల జాబితా, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్లు అటెస్ట్ చేసినవి తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీకోర్ టీం, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణకు ప్రకృతి వ్యవసాయమే ప్రధాన మార్గం

ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

సింహాద్రిపురం : రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రకృతి వ్యవసాయమే ప్రధాన మార్గమని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దిద్దేకుంట్ల గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు నాగేంద్ర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతు నాగేంద్ర తల్లి సిద్ధమ్మ, సోదరుడు, గ్రామస్తులను విచారించారు. అనంతరం మాట్లాడుతూ రైతులందరూ రసాయన వ్యవసాయం మానుకుని ప్రకృతి వ్యవసాయం చేసి భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. రసాయన వ్యవసాయంతో అప్పులు చేసుకోవడం వల్లనే దిద్దేకుంట్ల గ్రామ రైతు నాగేంద్ర కుటుంబం బలి అయిందన్నారు. రైతులు అధిక ఖర్చులు తగ్గించుకుని పంటలలో అధిక దిగుబడులు రావాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. ఏక పంట విధానం కాకుండా అయిదు రకాల ప్రధాన పంటలు సాగు చేసుకుంటే.. ఒక పంటలో నష్టపోయినా, మిగిలిన పంటల ద్వారా ఆదాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య జిల్లా వేదిక కన్వీనర్ పుత్తా శివన్న, ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మోడల్ మేకర్ రమణ, మండల సిబ్బంది రామకృష్ణ, రిబ్కా, సువర్ణ పాల్గొన్నారు.

30పీఎల్‌వీడీ253-170089 :- దిద్దేకుంట్లలో రైతు కుటుంబ సభ్యుల ఆత్మహత్యపై విచారణ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

హై లెవెల్ బ్రిడ్జి పరిశీలన



వేంపల్లెలో హైలెవెల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డులో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జిని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బాలు నాయక్ పరిశీలించారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో సోమవారం ఆయన ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డితో కలిసి ఆయన బ్రిడ్జి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ 2018లో రూ.33 కోట్ల వ్యయంతో పాపాఘ్ని నదిలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిధులు మంజూరయ్యాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ కాంట్రాక్టు దక్కించుకుని నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం పాపాఘ్ని నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో నిర్మాణ పనులు ఆగిపోయి ఆలస్యమైందన్నారు. నదిలో మొత్తం 16 పిల్లర్స్‌తో బ్రిడ్జి, రోడ్డుకు ఇరువైపులా వాకింగ్ ట్రాక్ నిర్మించారన్నారు. అంతేకాకుండా కొంతమేర నిర్మాణం పనులు పెండింగ్ ఉండటంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రూ.80లక్షల ఎంపీ నిధులు కేటాయించడంతో పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం అలిరెడ్డి పల్లె, ఎగువ తువ్వపల్లె, దిగువ తువ్వపల్లె గ్రామాల ప్రజలు, రైతులు వేంపల్లె మండల కేంద్రానికి రాకపోకలు ఇబ్బందులు లేకుండా సజావుగా సాగుతుండడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈలు శ్యామ సుందర రాజు, రామచంద్రనాయక్, డీఈ సుధాకర్ రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలి

ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ఆర్‌డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఆపరేషన్ ఎస్ఈ రమణతో కలిసి జిల్లాలోని కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడకుండా పనులు వేగవంతం చేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సింగిల్ ఫేస్ కేబుల్ లైన్ల స్థానంలో త్రీఫేస్ 5 వైర్ల ఎల్టీ లైన్‌ను కండక్టర్ ద్వారా ఏర్పాటు చేయడం, సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా పట్టణాలకు దీటుగా పరిశ్రమల ఏర్పాటు సులభతరం అవుతుందన్నారు. కొత్త లైన్లు వేసేందుకు ఆటంకాలు కలిగించకుండా సహకారం అందించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలి

- బాబు, పవన్ కల్యాణ్ తమ వైఖరి వెల్లడించాలి
- నిరసనలో ఐక్యవేదిక నాయకుల డిమాండ్



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఐక్యవేదిక నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను తూలనాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఆర్టీసీ బస్టాండు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీరాజా మాట్లాడుతూ అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల విషయం మరిచిన బీజేపీ దేశంలో అరాచకాన్ని సృష్టిస్తోందని విమర్శించారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెస్తోందని, ఈ వ్యూహంలో భాగమే అమిత్‌షా వ్యాఖ్యలని చెప్పారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ తన హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతోందన్నారు. అందుకు రాజ్యాంగం అడ్డంకిగా ఉందని, అందుకే దాన్ని రచించిన అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు పాల్పడ్డారని తెలిపారు. అంబేడ్కర్‌ను తూలనాడటం అంటే రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమేనని చెప్పారు. బీజేపీని వ్యతిరేకిస్తేనే దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోగలమన్నారు. షా వ్యాఖ్యలను ఖండించలేని స్థితిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉండడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని కూడా అమిత్‌షా చెప్పలేదని, దేశంలో ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ సైతం మౌనం వహించారంటే ఆ వ్యాఖ్యలు ఉద్దేశ పూర్వకంగా చేసినవిగానే భావించాల్సి ఉంటుందన్నారు. అంబేడ్కర్ జయంతులు, వర్ధంతులు జరిపే నాయకులు ఈ విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలని నిలదీశారు. అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ల పుణ్యమా అని పార్లమెంటులో అడుగు పెట్టగలిగిన 117 మంది ఎంపీలు కూడా మౌనంగా ఉన్నారంటే వారందరినీ రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన అమిత్‌షా దాన్ని రచించిన అంబేడ్కర్‌ను తూలనాడటం దురదృష్టకరమన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చేసి హిందూ రాజ్యాన్ని స్థాపించాలనుకోవడం దేశ లౌకిక వాదానికి ప్రమాదకరమన్నారు. అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు గుర్రాల గోపాల్, రిటైర్డ్ డీఈ గుర్రప్ప, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ రాజా వెంగళరెడ్డి, సావంత్ సుధాకర్‌రావు, సీఆర్‌పీ ప్రసాద్, బీఎస్పీ నాయకుడు సగిలి గుర్రప్ప, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఆప్ నాయకుడు డాక్టర్ శ్రీనివాసులు, మహాజన రాజ్యం పార్టీ నాయకుడు సంగటి మనోహర్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, జేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై విచారణను స్వాగతిస్తున్నా

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎమ్మెల్యే వరద విజిలెన్స్ అధికారులకు రాసిన లేఖను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : జగనన్న కాలనీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణను తాను స్వాగతిస్తున్నానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి తెలిపారు. సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 470 ఎకరాలు కొనుగోలు చేసి బొల్లవరం, మీనాపురం, రామేశ్వరం ప్రాంతాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 24వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అయితే జగనన్న కాలనీలకు సంబంధించిన భూ సేకరణలో తాను అవినీతికి పాల్పడ్డానని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు స్వయంగా లేఖ రాశారని తెలిపారు. నేరుగా రైతులే ప్రభుత్వానికి భూములు అమ్మడం, ఆ డబ్బును ప్రభుత్వం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. తాను రైతుల నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వానికి భూములు అమ్మినట్లు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారన్నారు. రెవెన్యూ రికార్డులను వెలికి తీస్తే రైతుల వివరాలు బయటపడుతాయని తద్వారా విచారణ సులువుగా జరుగుతుందన్నారు. లేని అవినీతిని చూపించే ప్రయత్నం చేయడం వరదకు తగదన్నారు. తాము తప్పు చేసి ఉంటే తప్పక బయట పడుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల కంటే మార్కెట్ ధర కంటే ఒకటిన్నర శాతం అదనంగా భూములకు ధర చెల్లించవచ్చన్నారు. అదే నిబంధనల ప్రకారం రైతుల భూములను తీసుకున్నామన్నారు. భూ సేకరణలో ఎక్కడ ఎవ్వరు తనకు కమీషన్ ఇచ్చారో విచారణలో రుజువు చేయించవచ్చన్నారు. రాగి నయాపైసా ఇచ్చినట్లు నిరూపించినా తాను నేరాన్ని అంగీకరిస్తానని తెలిపారు. మీలా డీఏడబ్ల్యూ కళాశాల స్థలాన్ని తాను స్వాధీనం చేసుకుని వ్యాపారం చేసుకోలేదన్నారు. మున్సిపాలిటీలో జరిగిన 1155 అభివృద్ధి పనులపై కూడా ఎమ్మెల్యే విచారణకు ఆదేశించారన్నారు. మీ దుర్బుద్ధితోనైనా తన నిజాయితీ బయట పడుతుందని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ అంజి, జంగమయ్య, బీఎస్‌ఆర్ పాల్గొన్నారు.

భర్తపై వరకట్నం వేధింపుల కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని ఏటూరు గ్రామానికి చెందిన అల్లం సత్యంపై వరకట్నం కోసం వేధించాడని కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఏటూరు గ్రామానికి చెందిన అల్లం నవీన ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

గండికోటలో టెంట్లు.. భారీగా పెరిగిన రెంట్లు



అనధికారికంగా వెలసిన టెంట్లు

- జనవరి వేడుకల కోసం ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వస్తున్న పర్యాటకులు
- దండుకుంటున్న టెంట్ల యజమానులు

జమ్మలమడుగు : ప్రముఖ పర్యాటక కేంద్రం గండికోటలో జనవరి వేడుకలను నిర్వహించుకునేందుకు గ్రూపులుగా భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండటంతో టెంట్లకు భారీగా డిమాండ్ పెరిగిపోయింది. దీంతో టెంట్ల యజమానులు రూ.1500 నుంచి మూడువేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే భారీ స్థాయిలో పర్యాటకులు టెంట్లను బుక్ చేసుకున్నారు.


పెరుగుతున్న అనధికార టెంట్లు..

గండికోటలో అక్రమంగా టెంట్లు పెరిగిపోతున్నాయి. పర్యాటక శాఖ, స్థానిక అధికారుల అనుమతులు లేకుండానే ఇష్టం వచ్చినట్లు పోటీపడి టెంట్లు ఏర్పాటు చేసి పర్యాటకుల వద్ద నుంచి దోపిడీకి తెరలేపుతున్నారు. గ్రామంలో టెంట్ల ఏర్పాటుపై రెండువర్గాల మధ్య విభేదాలు ఉన్నాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల కారుపై రాళ్లతో దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. గండికోట గ్రామంలో పెత్తనం కోసం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు..

పర్యాటక కేంద్రమైన గండికోటలో అక్రమ టెంట్లు వెలిసినా.. భారీగా మద్యం సరఫరా అవుతున్నా పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో ఉన్న గ్రాండ్ కెనాన్ గండికోటలో ఉండటంతో ప్రతి రోజు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఇదే అదనుగా చూసుకుని పర్యాటకుల నుంచి భారీగా టెంట్లకు రేటు వసూలు చేస్తున్నారు. అదికూడా పెన్నానది ఒడ్డున వరుసగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి భద్రత ఉండదు. కొండ ప్రాంతం కావడంతో విష పురుగుల సంచారం ఉంటుంది. ఏమైనా ప్రమాదం జరిగితే నష్టపోయేది పర్యాటకులే.

దోపిడీ చేస్తున్నారు



గండికోటకు వచ్చే పర్యాటకులను నిలువు దోపిడీ చేస్తున్నారు. టోల్ గేట్ పేరుతో టూరిజంశాఖ పర్యాటకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తోంది. కనీసం సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. అనధికార టెంట్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

– శివకుమార్, డీవైఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి.

మా భూమికి దారి వదలండి మహాప్రభో.!

– సోలార్ యాజమాన్యం వైఖరిపై ఆర్డీఓకు ఫిర్యాదు



ఆర్డీఓ సాయిశ్రీకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలం దొడియం గ్రామ పొలిమేరలో 1-61-1 సర్వే నంబర్‌లో తనకు 2.53 ఎకరాల సొంత పట్టా భూమి ఉందని, ఆ పొలానికి వెళ్లే దారిని సోలార్ యాజమాన్యం ముళ్లకంచెతో మూసివేస్తోందని బూబుసానిపల్లెకు చెందిన రైతు గువ్వల లక్ష్మిరెడ్డి సోమవారం జమ్మలమడుగు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి తాతల కాలం నుంచి ఆ పొలాన్ని తాము సాగు చేస్తున్నామని తెలిపారు. ఇంతవరకు ఆ పొలాన్ని సోలార్ ప్రాజెక్టుకు విక్రయించలేదని అయినప్పటికీ వారు ఆ పొలాన్ని కూడా తమ ప్రాజెక్టులో కలుపుకుని ప్రాజెక్టు చుట్టూ ముళ్లకంచె ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ సాయిశ్రీ తాను విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నక్కోనిపల్లె నుంచి ధన్నవాడకు వెళ్లే రహదారిని సోలార్ యాజమాన్యం మూసి వేయడం అన్యాయమని నక్కోనిపల్లె రైతులు వాపోయారు. ఈ మేరకు వారు కూడా ఆర్డీఓకు విన్నవించారు.

రెండు బార్లు, ప్రీమియం స్టోర్‌కు దరఖాస్తు చేసుకోండి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని రెండు బార్లు, ఒక ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం చివరి రోజు అని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో రెండు బార్లు, ఒక ప్రీమియం స్టోర్‌కు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు రెండు బార్లకు, ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు ఒక దరఖాస్తు కూడారాలేదన్నారు. ప్రీమియం స్టోర్‌కు దరఖాస్తుదారుడు నాన్ రిఫండబుల్‌గా రూ. 15 లక్షలు డీడీ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆలాగే స్టోర్ దక్కించుకున్న వారు లైసెన్స్ కింద రూ. కోటి చెల్లించాలన్నారు. జిల్లాలో కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌తో పాటు ఒక బార్‌ను, ఎర్రగుంట్లలో మరో బార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహిళ ఆత్మహత్య



పల్లవి మృతదేహం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని భాగాపురం జయమ్మ కాలనీ సమతా నగర్లో పల్లవి (25) అనే మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్లవికి సునీల్ కుమార్ రెడ్డితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సునీల్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. ఏడాది క్రితం కంపెనీ మూసివేయడంతో ప్రస్తుతం ఖాళీగా ఉన్నాడు. మూడు రోజుల క్రితం పులివెందులకు వచ్చి ఒక ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాల వల్ల సోమవారం తన ఆడపడుచు అలవలపాటి విజయలక్ష్మి ఇంట్లోని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకున్నట్లు ఎస్ఐ విష్ణు తెలిపారు. పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు సంఘటన స్థలాన్నా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.